# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 100 క్రిష్ణా, సోమవారం 05 - 01 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు


కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## మున్సిపల్ చైర్మన్ దంపతులను సత్కరించిన విరూపాక్షశ్వర స్వామి దేవస్థానం కమిటీ..





**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి మున్సిపాలిటీ,జనవరి 04(బ్యూరో చీఫ్ సల్మాన్):** బాలా త్రిపుర సుందరి సమేత విరూపాక్షశ్వర స్వామి వారి దేవస్థానం నందు శివ ముక్కోటి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం మరియు ఏక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఆయన సతీమణి రాధా లను ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు ఆలయ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో గరికపాటి శ్రీనివాసరావు పద్మావతి దంపతులు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ గరికపాటి శ్రీదేవి రాంబాబు, నిమ్మగడ్డ శ్రీనివాసరావు స్వరూప రాణి దంపతులు, బత్తుల శివాజీ వాణి దంపతులు, జాస్తి వెంకట మోహన్ రావు పార్వతి దంపతులు, నిమ్మగడ్డ మోహన్ స్వాతి దంపతులు, జాస్తి సోమయ్య వనమ్మ దంపతులు గ్రామ పెద్దలు జొన్నలగడ్డ శంకర్రావు పాల్గొన్నారు.

## ఆ ఊర్లోకి రాజకీయ నేతలకు నో ఎంట్రీ.. ఏకంగా బోర్డే పాతేశారు


**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04,** ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా రెండు జిల్లాలు ఏర్పాటైన సంగతి తెలిసిందే. డిసెంబర్ 31 నుంచి ఏపీలో జిల్లాల సంఖ్య 26 నుంచి 28కి పెరిగింది. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకి మార్చటంతో పాటుగా.. రంపచోడవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లాను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలాగే అడ్డరోడ్డు జంక్షన్, అద్దంకి, పీలేరు, మడకశిర, బనగానిపల్లి రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసింది. అలాగే కర్నూలు జిల్లాలోని ఆదోని మండలాన్ని రెండు మండలాలుగా విభజించారు. ఆదోని -1, ఆదోని -2 మండలాలుగా విభజించిన ఏపీ ప్రభుత్వం.. ఆదోని -1 మండలంలో 29 గ్రామాలను, ఆదోని -2 మండలంలో 17 గ్రామాలను చేర్చింది. అయితే ఈ మండలాల ఏర్పాటే ఇప్పుడు స్థానికంగా ఆందోళనలకు కారణమవుతోంది. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చటంపై.. ఇప్పటికే రాయచోటిలో నిరసనలు జరుగుతున్నాయి. తాజాగా కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలోనూ నిరసనలు మొదలయ్యాయి. ఆదోనిలోని పెద్ద హరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంగా ప్రకటించేవరకూ ఏ రాజకీయ నేతను కూడా తమ ఊర్లోకి అడుగుపెట్టనివ్వకూడదని నిర్ణయించారు. ఈ మేరకు ఊరి బయటన బోర్డు కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు ఆదోని మండలం రాష్ట్రంలోనే అతిపెద్ద మండలంగా గుర్తింపు పొందింది. అయితే పాలనాపరమైన సౌలభ్యంతో పాటుగా ప్రజల పరిస్థితిని అర్థం చేసుకుని ఆదోని మండలాన్ని నాలుగు మండలాలు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. స్థానిక ఎమ్మెల్యే పార్థసారథి కూడా ఈ విషయంపై అసెంబ్లీలో పలుమార్లు గళమెత్తారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో భాగంగా ఆదోని మండలాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు మండలాలుగా విభజించాలని నిర్ణయించింది. పెద్ద హరివాణం కొత్త మండలంగా కూడా ప్రకటించింది. పెద్ద హరివాణం మండలంలోకి 22 ఊర్లను కూడా కేటాయించింది.

అయితే మెజారిటీ గ్రామాల ప్రజల పెద్ద హరివాణం మండల ఏర్పాటును అంగీకరించలేదు. 16 గ్రామాల ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. నిరసన దీక్షలు చేపట్టారు. దీంతో ఏపీ ప్రభుత్వం ఆదోని మండలాన్ని, ఆదోని -1, ఆదోని -2గా విభజించింది. అయితే ఈ నిర్ణయంపై పెద్దహరివాణం గ్రామస్థులు మండిపడుతున్నారు.

ముందుగా ప్రకటించిన విధంగా తమ గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో నిరసన కార్యక్రమాలు చేపడుతున్న పెద్ద హరివాణం గ్రామస్థులు.. తాజాగా తమ ఊరిని మండల కేంద్రం చేసేవరకూ ఏ రాజకీయ నాయకుడిని కూడా ఊర్లోకి రానివ్వకూడదని నిర్ణయించారు. ఆ మేరకు ఊరి బయట బోర్డును పాతారు.

# ఉత్తరాంధ్ర ప్రగతి పథంలో మరో మైలురాయి..

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో విజయవంతంగా దిగిన తొలి విమానం



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04,** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారమయ్యే దిశగా కీలక అడుగు పడింది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంలో రన్‌వే వ్యాలిడేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా మొదటిసారిగా ట్రయల్ రన్ నిర్వహించిన విమానం సురక్షతంగా ల్యాండ్ కావడంతో ఈ ప్రాజెక్టులో మరో ప్రధాన ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ విజయం ఆంధ్రప్రదేశ్ విమానయాన రంగ చరిత్రలో ఒక చిరస్మరణీయమైన రోజుగా నిలిచిపోతుందని నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ కీలక పరిణామంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర విమానయాన రంగ ప్రయాణంలో ఇవాళ మరో గొప్ప మైలురాయిని చేరుకున్నామని ఆయన తన అధికారిక ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కేవలం ఒక విమానాశ్రయం మాత్రమే కాదని, ఇది రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక వృద్ధికి కొత్త రెక్కలను ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఇది ఒక గేమ్ చేంజర్ కానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ఇంత వేగంగా కార్యరూపం దాల్చడానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని ముఖ్యమంత్రి కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా చంద్రబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఇలాంటి భారీ అంతర్జాతీయ ప్రాజెక్టులు సాధ్యమవుతాయని, భవిష్యత్తులో ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఈ విమానాశ్రయం ఎంతగానో దోహదపడుతుందని ఆయన తన సందేశంలో వివరించారు. భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే విశాఖపట్నం, విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాల్లో పర్యాటక రంగంతో పాటు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమవుతున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ద్వారా విదేశీ పెట్టుబడులు ఆకర్షించడానికి మరియు ఎగుమతులు పెరగడానికి మార్గం సుగమం అవుతుంది. నేటి వ్యాలిడేషన్ ఫ్లైట్ ల్యాండింగ్ విజయవంతం కావడంతో, త్వరలోనే సాధారణ ప్రయాణికులకు కూడా విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# గోదావరి జలాలపై రాజకీయ రగడ..

## బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరుపై సోమిరెడ్డి ధ్వజం




**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04,** గోదావరి జలాల వినియోగంపై తెలుగు రాష్ట్రాల మధ్య మళ్ళీ రాజకీయ వేడి రాజుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గోదావరి నీటిలో ఒక్క చుక్క వాడుకున్నా ఊరుకోబోమని బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏటా సుమారు 3 వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయని, అటువంటప్పుడు పొరుగు రాష్ట్రం వాడుకుంటే అభ్యంతరం చెప్పడంలో అర్థం లేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రాల మధ్య జలాల పంపిణీ విషయంలో ఇలాంటి సంకుచిత ధోరణి ప్రదర్శించడం సరికాదని ఆయన హితవు పలికారు.

బీఆర్ఎస్ నేతల విమర్శలకు ప్రతిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే ధోరణిలో స్పందించడాన్ని సోమిరెడ్డి తప్పుబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కూడా నీటిని వాడుకోవద్దని చెప్పడం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా గోదావరి మిగులు జలాలను రాయలసీమకు ఇచ్చి ఆ ప్రాంతాన్ని ఆదుకుంటామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా సోమిరెడ్డి గుర్తు చేశారు. అప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటం రాజకీయ ద్వంద్వ నీతికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ వివాదంపై సోమిరెడ్డి తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇద్దరూ ఒకప్పుడు టీడీపీలో పనిచేసిన వారేనని ఆయన వ్యాఖ్యానించారు. టీడీపీ నుంచి వెళ్ళిన నాయకులే ఇప్పుడు ముఖ్యమంత్రులుగా ఉండి ఇలాంటి వివాదాలకు తెరలేపడం విచారకరమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఉన్న సఖ్యతను, వనరుల పంపిణీలో ఉన్న సమతుల్యతను నేటి పాలకులు విస్మరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చివరగా, తెలుగు రాష్ట్రాల మధ్య జల జగడాలు సృష్టించడం వల్ల సామాన్య రైతులకు నష్టం తప్ప ఏమీ ఉండదని సోమిరెడ్డి స్పష్టం చేశారు. వృథాగా సముద్రం పాలు అవుతున్న నీటిని రాయలసీమ వంటి కరువు ప్రాంతాలకు మళ్లించడం వల్ల ఇరు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని ఆయన సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టించకుండా, నీటి వినియోగంపై శాస్త్రీయంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల పాలకులు పంతాలకు పోకుండా రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని ఆయన కోరారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామా :భోగాపురం: త్వరలోనే ప్రారంభోత్సవం!



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04,** ఉత్తరాంధ్ర రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా ఈ విమానాశ్రయంలో నిర్వహించిన టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ విజయవంతం కావడంతో ప్రాజెక్టు తుది దశకు చేరుకున్నట్లు స్పష్టమైంది. ఈ చారిత్రాత్మక సందర్భంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ అనేది విమానాశ్రయ నిర్మాణంలో ఒక కీలకమైన మైలురాయి అని, ఇది ప్రాజెక్టు విజయవంతానికి నిదర్శనమని సంతోషం వ్యక్తం చేశారు. విమానాశ్రయ పనుల పురోగతిపై మంత్రి స్పష్టతనిస్తూ, మరో 4 నుంచి 5 నెలల వ్యవధిలోనే భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. విమానాశ్రయానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పన దాదాపు పూర్తయిందని, ఫినిషింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నిర్ణీత కాలవ్యవధిలోగా ప్రారంభోత్సవం చేసి, ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కేవలం రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, ఈ విమానాశ్రయం రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ సరికొత్త పుంతలు తొక్కబోతోందని మంత్రి వివరించారు. ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాబోయే కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. పారిశ్రామికంగా, ఆర్థికంగా విశాఖ ప్రాంతాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, దీనివల్ల స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావడం వల్ల పర్యాటకం, వాణిజ్యం మరియు ఐటీ రంగాలు ఊపందుకుంటాయని, ఇది ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక స్థితిగతుల్ని పూర్తిగా మార్చివేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి వసతులతో నిర్మితమవుతున్న ఈ ఎయిర్‌పోర్ట్, దక్షణ భారతదేశంలోనే ఒక కీలకమైన హబ్‌గా మారుతుందని మంత్రి స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తున్నట్లు ఆయన గర్వంగా ప్రకటించారు.

## భోగాపురంలో తొలి విమానం ల్యాండ్..... మాజీ సీఎం జగన్ ఆసక్తికర పోస్ట్



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , ఉత్తరాంధ్ర వాసుల ఎన్నో ఏళ్ల కల నేడు సాకారమైంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం తొలి విమానం ల్యాండ్ అయింది. దీనిపై ఉత్తరాంధ్ర ప్రజలతో పాటుగా కూటమి నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, మోదీ నాయకత్వంలో భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం కల సాకారమైందన్నారు. నేడు తనకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం దీనిపై స్పందిస్తూ ఃఎక్స్ః వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం సాకారమైనందుకు తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖపట్నంలో నూతనంగా నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో నేడు తొలి విమానం ల్యాండింగ్ కావడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మార్గంలో ఒక మైలురాయి అని చెప్పుకొచ్చారు. ఎంఅంఅశీఅఎఅఓ్ఘుస్త్ర లక్ష్యన్ని సాధించే దిశగా కీలక ముందడుగు పడిందన్నారు. ఈ విమానాశ్రయం నిర్మాణంలో అసాధారణ కృషి చేసిన +వీ= గ్రూప్‌కు జగన్.. హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తమ పాలనా కాలంలో వేగవంతమైన అనుమతులు సాధించడమే కాక, విమానాశ్రయం నిర్మాణం కోసం భూములు ఇచ్చిన వారికి పునరావాసం కల్పించడం, భూసేకరణ కోసం నాడు తమ ప్రభుత్వం సుమారు రూ. 960 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది వేసిందని వైఎస్ జగన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తైందన్నారు. ఆ రోజు తాము చేసిన కృషి నేడు ఈ కీలక మైలురాయిని చేరుకునేందుకు ముఖ్య కారణంగా నిలిచిందని జగన్ గుర్తు చేశారు.

అలానే విశాఖ పోర్టును భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ బైపాస్ జాతీయ రహదారి ప్రాజెక్ట్‌కు కూడా తమ పాలనలోనే అనగా.. 2023 మార్చిలో ఆమోదం ఇచ్చిన నితిన్ గడ్కరీ గారి కృషి, సహకారం తనకు గుర్తుందంటూ జగన్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

## ఉపాధి కూలీల పిల్లలకు రోజుకు రూ.307 స్టైఫండ్

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతూ ఉంటాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తుంటాయి. ఈ క్రమంలోనే అల్లూరు సీతారామరాజు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి హామీ పథకం అధికారులు శుభవార్త వినిపించారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలంలో నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారు. జనవరి 6వ తేదీన వెలుగు కార్యాలయంలో ఈ ఉద్యోగమేళా జరగనుంది. ఈ ఉద్యోగ మేళాలో ఎంపికైన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వివిధ రంగాల్లో శిక్షణ అందిస్తారు. డీడీయూ, సీడాప్, జీకేవై ద్వారా ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, లాజిస్టిక్, ఆటోమొబైల్ రంగాలలో నిరుద్యోగ యువతకు శిక్షణ అందించనున్నారు. అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఈ విషయాన్ని ఉపాధి హామీ పథకం ఏపీవో సూరిబాబు వెల్లడించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటుగా తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, కులధ్రువీకరణ పత్రం, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబ్ కార్డు జిరాక్సులను తీసుకుని రావాలని సూచించారు. ఎంపికైన వారికి ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇప్పటికే వంద రోజుల పని పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కూలీల పిల్లలకు రోజుకు 307 రూపాయల చొప్పున స్టైఫండ్ కూడా ఇస్తున్నట్లు ఏపీవో సూరిబాబు వెల్లడించారు. ఇంకా ఏమైనా వివరాలు కావాలంటే 8500904876, 9492572737 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మరోవైపు గ్రామీణ ప్రాంత యువతకు స్వయం



ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థతో పాటుగా వివిధ బ్యాంకులకు చెందిన సంస్థలు కూడా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. యువకులకు డ్రైవింగ్, సెల్ ఫోన్ రిపేర్, మెకానిక్, వంటి స్వయం ఉపాధి కోర్సులలో ట్రైనింగ్ ఇస్తున్నారు. యువతులకు టైలరింగ్, బ్యూటీషియన్, కుట్లు, అల్లికలు వంటి అంశాలపై ఉచిత శిక్షణ అందిస్తూ వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా, ఆర్థిక స్వాతంత్ర్యం సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఉపాధి హామీ పథకం అధికారులు.. గ్రామీణ ప్రాంత యువతకు ఈ సదవకాశం కల్పిస్తున్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు.

## ఒంగోలులో అక్రమ నిర్మాణాలపై నగరపాలక సంస్థ కొరడా,,,, ఒకేసారి 3 వేల మంది యజమానులకు నోటీసులు





క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04, ఒంగోలు నగరపాలక సంస్థ ఒకేసారి 3 వేల మంది భవనాలు, ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసి సంచలనం సృష్టించింది. ఇంతకీ ఎందుకు ఈ నోటీసులు జారీ చేసిందంటే, వీరంతా అనధికారికంగా, అక్రమంగా భవనాలు, ఇళ్లు నిర్మించారు. అయితే వీటిని క్రమబద్ధీకరించుకోవడానికి నగరపాలక సంస్థ అవకాశం ఇచ్చినా, యజమానులు ముందుకు రాకపోవడంతో, వారికి నోటీసులు జారీ చేసి, రెడ్ మార్క్ వేసే చర్యలు చేపట్టింది. క్రమబద్ధీకరణకు ఈ సంవత్సరం, మార్చి 11 తుది గడువుగా నిర్ణయించినా, ఇప్పటివరకు కేవలం 534 దరఖాస్తులు మాత్రమే అందాయి. వీటిలో 257 దరఖాస్తులకు పూర్తి రుసుము చెల్లించడంతో, అధికారులు వాటిని క్రమబద్ధీకరించారు. నగరంలో సుమారు 6 వేల అనధికారిక నిర్మాణాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో వీరిలో సుమారు 3 వేల మందికి నోటీసులు పంపారు. గడువులోగా క్రమబద్ధీకరించుకోకపోతే చట్ట ప్రకారం కూల్చివేస్తామని ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు హెచ్చరించారు. ఈ క్రమబద్ధీకరణ పథకం ద్వారా నగరపాలక సంస్థకు అపరాధ రుసుము రూపంలో సుమారు రూ.70 కోట్లు ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.ఈ పథకం ద్వారా స్థానిక సంస్థలు ఆర్థికంగా బలపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. దాదాపు 8 ఏళ్ల తర్వాత అక్రమ నిర్మాణాలు, భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో, పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందని అధికారులు ఆశించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఒంగోలు నగరంలో అనేక బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. ప్రభుత్వం క్రమబద్ధీకరణ కోసం ఈ పథకం అమలు చేస్తుందనే ఆలోచనతో చాలామంది నిబంధనలు పాటించకుండానే నిర్మాణాలు చేపట్టారు. నగరంలోని రామనగర్, ముంగమూరు రోడ్డు, రాజీవ్‌నగర్, కొప్పోలు రోడ్డు వంటి ప్రాంతాల్లో జీ ప్లస్ త్రీ (+ం3) కి మాత్రమే అనుమతి తీసుకుని, అనధికారికంగా అదనపు అంతస్తులు నిర్మించారు. ఇలాంటి భవనాలను అమ్మాలంటే, క్రమబద్ధీకరణ తప్పనిసరి. వ్యక్తిగత ఇళ్లు, వాణిజ్య సముదాయాల్లో ప్లాన్ నిబంధనలు పాటించని వారు, తేడాను బట్టి అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ పథకంకు అర్హులైనవారు పెద్ద సంఖ్యలో ముందుకు రాకపోవడంతో, కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది నోటీసులు జారీ చేయడంతో పాటుగా, నిర్మాణాల ప్రహరీలపై ఎర్ర రంగుతో ధీూా నంబర్ వేసి హెచ్చరికలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ‹సకాలంలో క్రమబద్ధీకరించుకోకుంటే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం› అని తెలిపారు. ఇదే నిబంధన లేఅవుట్ల క్రమబద్ధీకరణకు కూడా వర్తిస్తుందని వెల్లడించారు. గడువులోగా అక్రమ నిర్మాణాలు భవనాలను క్రమబద్ధీకరించుకోకపోతే, చట్ట ప్రకారం వాటిని కూల్చివేస్తామని నోటీసుల్లో స్పష్టంగా హెచ్చరించారు.

## విద్యార్థులకు పండగే పండగ.. జనవరిలో సగానికి పైగా రోజులు సెలవులే!

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు ఈ జనవరి నెల తీపి కబురును మోసుకొచ్చింది. క్యాలెండర్‌ను గమనిస్తే ఈ నెలలో దాదాపు సగం రోజులు విద్యాసంస్థలు మూతపడనున్నాయి. ముఖ్యంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీ నుండి 18వ తేదీ వరకు వరుసగా 9 రోజుల పాటు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. దీనికి తోడు ఆదివారాలు, ఇతర పండుగలు తోడవడంతో విద్యార్థులకు చదువు ఒత్తిడి నుంచి భారీ ఊరట లభించనుంది. ఈ నెలలో కేవలం సంక్రాంతి సెలవులే కాకుండా మరికొన్ని ముఖ్యమైన రోజులు కూడా సెలవుల జాబితాలో చేరాయి. జనవరి 23న వసంత పంచమి సందర్భంగాూవిద్యాసంస్థలకు విరామం ఉండగా, జనవరి 25 ఆదివారం మరియు జనవరి 26 గణతంత్ర దినోత్సవం కావడంతో వరుసగా రెండు రోజులు స్కూళ్లు బంద్ కానున్నాయి. వెరసి సాధారణ పాఠశాలలకు ఈ నెలలో మొత్తం 12 రోజుల పాటు అధికారిక సెలవులు లభిస్తున్నాయి. ఇది అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు విశ్రాంతినిచ్చే అంశం. నగరాల్లోని కార్పొరేట్ మరియు ఇంటర్నేషనల్ స్కూళ్ల పరిస్థితి చూస్తే సెలవుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంది. సీబీఎస్ఈ (జదీూజు) సిలబస్ అనుసరించే స్కూళ్లు మరియు ఇంటర్నేషనల్ స్కూళ్లు శనివారాల్లో కూడా సెలవు పాటిస్తాయి. దీనివల్ల ఈ నెలలో వారికి అదనంగా మరో మూడు సెలవులు వచ్చి చేరుతున్నాయి. అంటే ఈ విద్యాసంస్థల విద్యార్థులు జనవరి నెలలో మొత్తం 14 నుండి 15 రోజుల పాటు ఇళ్లకే పరిమితం కానున్నారు. వెరసి నెలలో సగం రోజులు క్లాసులు జరిగితే, మిగిలిన సగం రోజులు ఆటపాటలతో గడిచిపోనున్నాయి. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడ పండుగ సెలవులు మరియు ఇతర సెలవు దినాలను పరిగణనలోకి తీసుకుంటే విద్యార్థులకు 10 నుండి 12 రోజుల వరకు సెలవులు లభించే అవకాశం ఉంది. సంక్రాంతి సెలవుల విషయంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో, విద్యార్థులు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తం మీద ఈ జనవరి నెల తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు సెలవుల సందడిని తీసుకువచ్చిందని చెప్పవచ్చు.

## కృష్ణా జలాలపై త్వరలోనే వాస్తవాలు వివరిస్తానన్న సీఎం చంద్రబాబు




క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04 , తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా నదీ జలాల వివాదంపై చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ దుమారం రేపాయి. తన విజ్ఞప్తి మేరకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలిపివేశారని రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రకటించడం ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. నా మీద ఉన్న గౌరవంతో చంద్రబాబు ఆ పనులు ఆపేశార అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ఈ నేపథ్యంలో, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వివాదంపై స్పందించారు. కృష్ణా జలాల విషయంలో అసలు ఏం జరిగిందో త్వరలోనే మీడియా ద్వారా అన్ని వాస్తవాలు వివరిస్తానని ఆయన తెలిపారు. చంద్రబాబు వివరణ తర్వాత ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఏపీ రైతులకు తీపికబురు.. అకౌంట్లోకి రూ.6000 అప్పుడే



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత నిధుల విడుదలకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం కిసాన్ యోజనతో కలిసి.. ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఏటా మూడు దశలుగా రూ.20 వేలు అందించనున్నారు. తొలి రెండు విడుతలు రూ.7000 చొప్పున, మూడో విడతలో రూ.6000 చొప్పున రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా రైతులకు రూ.14000లను ఏపీ ప్రభుత్వం అకౌంట్లలో జమ చేసింది. మూడో విడత కింద రూ.6000 జమ చేయనుంది.

అయితే పీఎం కిసాన్ యోజన తో కలిసి అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్న ఏపీ ప్రభుత్వం.. పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల చేసినప్పుడే.. అన్నదాత సుఖీభవ డబ్బులు కూడా విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో 2026 ఫిబ్రవరి నెలలో పీఎం కిసాన్ యోజన 22వ విడత సాయాన్ని కేంద్రం విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత కూడా ఫిబ్రవరి నెలలోనే విడుదల చేయనున్నట్లు సమాచారం. ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా ఇదే విషయాన్ని ఇటీవల వెల్లడించారు.

మంత్రి అచ్చెన్నాయుడు శనివారం కర్నూలు జిల్లా కోడుమూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఉల్లి రైతులకు నష్టపరిహారం అందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడిన అచ్చెన్నాయుడు.. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్రంలోని రైతులకు 14 వేల రూపాయలు సహాయం అందించినట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత కింద ఫిబ్రవరి నెలలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.6000 చొప్పున జమ చేస్తామని వెల్లడించారు.


ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత డబ్బులు జమయ్యే అవకాశాలు ఉన్నాయని భావించవచ్చు. మరోవైపు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా.. అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత నిధులు త్వరలోనే జమ చేస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వచ్చే నెలలోనే రైతుల అకౌంట్లలోకి ఆరు వేల రూపాయలు జమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## 2026 జూన్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతాయన్న మంత్రి లోకేశ్



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం తొలిసారి విమానం ల్యాండ్ అయింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఏ320 కమర్షియల్ వ్యాలిడేషన్ ఫ్లైట్ విజయవంతంగా భోగాపురం ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయింది. ఇందులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర అధికారులు ప్రయాణించారు. విమానాశ్రయం ప్రారంభానికి ముందు రన్‌వే, నావిగేషన్ వ్యవస్థల పనితీరును పరిశీలించేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేపై విమానం సురక్షితంగా దిగడంతో, ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు దాదాపు 97 శాతం పూర్తయి తుది దశకు చేరుకున్నట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇక్కడ ఏవియేషన్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలనేది నారా లోకేశ్ ఆలోచన అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, ప్రధాని మోదీ దార్శనికతతో 2014-19 ఎన్డీఏ హయాంలో ప్రారంభించిన ఈ విమానాశ్రయం, 2026 జూన్ నాటికి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతుందని తెలిపారు. ఇది ఉత్తరాంధ్రను కొత్త శిఖరాలకు చేర్చుతుందని ధీమా వ్యక్తం చేశారు. సుమారు రూ.4,592 కోట్ల వ్యయంతో జీఎంఆర్ సంస్థ పీపీపీ పద్ధతిలో ఈ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తోంది. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దారు. రానున్న 4-5 నెలల్లోనే వాణిజ్య సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది

## చంద్రగ్రహణం సందర్భంగా.. ఆ రోజు తిరుమల ఆలయం మూసివేత



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04, తిరుమల శ్రీవారి భక్తులకు ముఖ్య గమనిక. మార్చి నెలలో తిరుమల శ్రీవారి ఆలయం మూతపడనుంది. మార్చి 3వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయ ద్వారాలను పది గంటల పాటు మూసివేయనున్నారు. ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటనలో వెల్లడించింది. మార్చి మూడో తేదీ సాయంత్రం 3 గంటల 20 నిమిషాలకు చంద్రగ్రహణం ప్రారంభం కానుంది. సాయంత్రం 6 గంటల 47 నిమిషాల వరకూ చంద్రగ్రహణం కొనసాగనుంది. ఈ చంద్రగ్రహణం మూడున్నర గంటల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో గ్రహణం ప్రారంభానికి ఆరు గంటల ముందుగానే తిరుమల శ్రీవారి ఆలయ ద్వారాలను మూసివేయనున్నట్లు టీటీడీ వెల్లడించింది. మార్చి 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల 30 నిమిషాల వరకూ తిరుమల ఆలయం ద్వారాలు మూతపడనున్నాయి. గ్రహణ కాలం ముగిసిన తర్వాత ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం భక్తులను తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతించనున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి ఎనిమిదిన్నర గంటల తర్వాత మాత్రమే భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. చంద్రగ్రహణం నేపథ్యంలో మార్చి మూడో తేదీన తిరుమల శ్రీవారి ఆలయంలో అష్టాదళ పాదపద్మారాధన సేవ, ఊంజల్ సేవ, కళ్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకర సేవలను రద్దు చేసినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తులు ఈ విషయాన్ని గమనించుకోవాలని సూచించింది.

దేవుని గడపలో బ్రహ్మోత్సవాలు

మరోవైపు కడప జిల్లా దేవుని కడపలో ఉన్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. జనవరి 19 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జనవరి 18వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల సమయంలో అంకురార్పణ చేయనున్నారు.

జనవరి 24న ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం జరుగనుంది. రూ.300/- చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. జనవరి 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం, సాయంత్రం వాహనసేవలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగాప్రతిరోజు హరికథలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## ఏపీలోనే తొలిసారిగా....విశాఖలో మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీ

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 04, మనిషికి ప్రాణాధారం నీరు. తిండి లేకుండా అయినా కొన్ని రోజులు జీవించగలరేమో కానీ.. నీరు లేకుండా అంటే అసాధ్యమనే చెప్పాలి. అలాంటి నీరు కూడా కల్తీ అవుతున్న పరిస్థితి. ఆర్వో ప్లాంట్ల నుంచి మంచి నీరు వాటర్ క్యాన్లలో తెచ్చుకుంటున్నప్పటికీ.. అవెంత వరకూ శుద్ధమైనవనేది దేవుడికే తెలియాలి. అయితే ఇలాంటి కష్టాలు లేకుండా నీటిని పరీక్షించే ల్యాబ్ మీకు అందుబాటులో ఉంటే.. అది కూడా మీ ఇంటి వద్దకే వస్తే.. వావ్, సూపర్ అనిపిస్తోంది కదా.. ఇలాంటి సౌకర్యం త్వరలోనే విశాఖపట్నం వాసులకు అందుబాటులోకి రానుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖలో మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీ అందుబాటులోకి రానుంది. విశాఖపట్నం నీటి సరఫరా సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల ద్వారా రూ. 40 లక్షల ఖర్చుతో ఈ ల్యాబ్-ఆన్-వీల్స్‌ను కొనుగోలు చేసింది. ఈ ల్యాబ్ సాయంతో నీటిలోని హానికరమైన లోహాలు, బ్యాక్టీరియా, క్లోరిన్ స్థాయిలు, టర్బిడిటీ, కాఠిన్యాన్ని పరీక్షించవచ్చు. అలాగే శిక్షణ పొందిన కెమిస్టులు ఇందులో అందుబాటులో ఉంటారు. విశాఖపట్నంలోని అన్ని వార్డులను ఈ మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలోని నీటిని అక్కడికక్కడే పరీక్ష నిర్వహిస్తారు. ఈ ల్యాబ్‌లోని పరికరాలను ఉపయోగించి నీటి నాణ్యతను శాస్త్రీయంగా విశ్లేషించడానికి నిపుణులైన కెమిస్టులు మొబైల్ ప్రయోగశాలలో అందుబాటులో ఉంటారు. మరోవైపు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఈ మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీని పరిశీలించారు. పౌరులకు పరిశుభ్రమైన, సురక్షతమైన తాగునీటిని అందించే లక్ష్యంతో ఈ అధునాతన





మొబైల్ ప్రయోగశాలను ప్రవేశపెట్టడం గర్వకారణమని జీవీఎంసీ కమిషనర్ అన్నారు. ఈ మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీలో.. స్పెక్ట్రోఫోటోమీటర్, టర్బిడిటీ మీటర్, డిజిటల్ టైట్రేటర్‌తో సహా ఏడు అధునాతన పరీక్ష పరికరాలు ఉన్నాయని వివరించారు. ఈ పరికరాలు హానికరమైన లోహాలు, బ్యాక్టీరియా, క్లోరిన్ స్థాయిలు, నీటి కాఠిన్యాన్ని తక్షణమే గుర్తించడానికి వీలు కల్పిస్తాయని తెలిపారు. మరోవైపు కలుషిత నీటి వల్ల కలిగే అతిసారం, టైఫాయిడ్ వంటి వ్యాధులను నియంత్రించడంలో ఇలాంటి పరీక్షలు ఎంతో సహాయపడతాయని జీవీఎంసీ కమిషనర్ అన్నారు. అనంతరం ఈ మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీ వాహనాన్ని అధికారికంగా జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం అధికారులకు అప్పగించారు. ఆ తర్వాత అధికారులు ఈ వాహనాన్ని.. తాగునీటి సరఫరా విభాగానికి అప్పగించారు.

# క్యాజువాల్టీలో కాసుల కక్కుర్తి

**రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న కేజీహెచ్ సిబ్బంది**

**ఇవ్వకుంటే సేవల్లో జాప్యం**

**చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు**




క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, జనవరి 4 ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి కేజీహెచ్‌లో రోగులను సిబ్బంది డబ్బుల కోసం వేధిస్తున్నారు. కట్టు కట్టాలన్నా, వార్డుకు తరలించాలన్నా, స్ట్రెచర్‌పై తీసుకువెళ్లాలన్నా కాసులు ముట్టజెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. డబ్బులు ఎందు కివ్వాలని ఎవరైనా ప్రశ్నిస్తే వారికి అందించాల్సిన సేవల ను తాత్సారం చేస్తూ తీవ్ర ఇబ్బంది పెడుతున్నారు. ఇదే పరిస్థితిని నగరానికి చెందిన ఎన్.తేజేశ్వరరావు అనే యువకుడు ఎదుర్కొన్నాడు. ఈ నెల 31న బైక్‌పై వస్తున్న తేజేశ్వరరావును రాంగ్‌రూట్‌లో వచ్చిన యువకులు బైక్‌తో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తేజేశ్వరరావు చేతి వేళ్లకు గాయమైంది. స్నేహితులు వెంటనే కేజీహెచ్‌లోని క్యాజు వాల్టీకి తీసుకువెళ్లారు. వైద్యుడు పరీక్షించి ఎక్స్‌రే తీయిం చారు. ఆ తరువాత కట్టు కట్టాల్సిందిగా నర్సింగ్ సిబ్బంది (మేల్)కి, వార్డు బాయ్‌కు సూచించారు. అయితే, కట్టు కట్టేందుకు సదరు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారు. బయటకు వెళ్లి కట్టు వేయించుకునేందుకు మూడు వేలు అవుతుందని, రూ.వెయ్యి ఇస్తే కడతామని చెప్పడంతో తేజేశ్వరరావు, యువకులు ఆశ్చర్యపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బులిచ్చి కట్టు కట్టించుకున్నారు.

అది కూడా సరిగా కట్టకపోవడంతో యువకుడు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. రెండు వేళ్ల మధ్య ప్లాస్టర్లు అంటించాల్సి ఉన్నప్పటికీ...వేళ్ల నుంచి మోచేతి వరకు కట్టు గట్టిగా బిగించి కట్టారు. దీంతో వేళ్ల నుంచి మోచేతి వరకు వాచిపోయి యువకుడు విలవిల్లాడాడు. ఈ బాధను భరించలేక మరో ఆస్పత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు చేతిని పరిశీలించి మోచేతి వరకూ వేసిన కట్టును తొలగించారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం..

కేజీహెచ్ క్యాజువాల్టీలో వసూళ్ల వ్యవహారంపై ఎప్పటి నుంచో ఆరోపణలు వస్తున్నాయి. వార్డుకు తరలించడానికి, పరీక్షలకు తీసుకువెళ్లడానికి, ఇతర సేవలు అందించేం దుకు ఇంత అని రేటు ఫిక్స్ వసూలు చేస్తుంటారన్న ఫిర్యా దులున్నాయి. అయినా, అధికారులు పట్టించుకోకపోవడం తో సిబ్బంది ముఖ్యంగా వార్డుబాయ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నేటి నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)-3 పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న సుమారు మూడు లక్షల మంది విద్యార్థులకు నిర్వహించనున్న పరీక్షలు ఈ నెల ఎనిమిదోతేదీ వరకు జరుగుతాయి. సబ్జెక్టు వారీగా 35 మార్కులకు ప్రశ్నపత్రాన్ని ఎస్సీఈఆర్‌టీ రూపొందించి ముద్రించింది. ఇప్పటికే ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరాయి. ప్రతిరోజు ఉదయం ప్రాథమిక పాఠశాలల టీచర్లు సమీపంలోని క్లస్టర్ కాంప్లెక్స్ పాఠశాలల నుంచి, ఉన్నత పాఠశాలల టీచర్లు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ప్రశ్నపత్రాలు తీసుకోవాలని జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి ఎంవీ కృష్ణకుమార్ తెలిపారు. ఎఫ్ఏ-3 పరీక్షలో ఒకటి, రెండు తరగతులకు ఎక్కువగా టీచర్ల సహాయంతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాలు వాట్సాప్ ద్వారా పంపే విధానం లేదని, ఎస్సీఈఆర్‌టీ ముద్రించిన ప్రశ్నపత్రాలు జిల్లాకు సరఫరా చేశారన్నారు.

## ఊటగెడ్డ రిజర్వాయర్ కబ్జా చినరాచపల్లిలో ఊటగెడ్డ రిజర్వాయర్

**20 ఎకరాలను చదును చేసిన ఆక్రమణదారులు**

**మామిడి, జీడిమామిడి, సరుగుడు మొక్కలు వేయడానికి సన్నద్ధం**

**చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు**

**పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన ఆయకట్టు రైతులు**

క్రైం కౌంటర్ న్యూస్, మాకవరపాలెం, జనవరి 4: పరిశ్రమల కోసం కొండపోరంబోకు భూములను ప్రభుత్వం కేటాయిస్తుండడంతో, మిగిలిన భూములపై ఆక్రమణదారుల కన్ను పడింది. కొండపోరంబోకు భూములతో పాటు సాగునీటి రిజర్వాయర్ భూములను సైతం కబ్జా చేస్తున్నారు. మండలంలోని రాచపల్లి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 737లో సుమారు 1,620 ఎకరాల కొండపోరంబోకు భూములు వున్నాయి. ఒక సర్వే నంబరులో ఇంత పెద్దమొత్తంలో ప్రభుత్వం భూములు జిల్లాలో మరెక్కడా లేవు. ఈ సర్వే నంబరు పరిధిలో ఎరకన్నపాలెం, రామన్నపాలెం, చినరాచపల్లి, వెంకయ్యపాలెం గ్రామాలు ఉన్నాయి. ఇందులో కొంత భూమిని ఆయా గ్రామాల రైతులు ఆక్రమించుకుని మాడిడి, జీడిమామిడి తోటలు సాగు చేసుకుంటూ ఫలసాయాన్ని పొందుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 737 సర్వే నంబరులో రైతుల సాగులో ఉన్న 410 ఎకరాలను పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించింది. ఎప్పటి నుంచో సాగుదారులుగా వున్న చిన్న, సన్నకారు రైతులకు నిబంధనల మేరకు పరిహారం ఇవ్వనున్నట్టు అధికారులు ప్రకటించారు. కాగా ఇదే సర్వే నంబరులో సుమారు 55 ఎకరాల్లో 2004వ సంవత్సరంలో నాడు మంత్రిగా ఉన్న ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు సుమారు రూ.88 లక్షలు మంజూరు చేయించి ఊటగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మింపజేశారు. ప్రస్తుతం పరిశ్రమల కోసం ప్రభుత్వం



తీసుకున్న 410 ఎకరాల భూమికి ఎగువన ఈ రిజర్వాయర్ ఉంది. మిగిలిన భూమి రిజర్వాయర్‌కు ఎగువన ఉంది. భవిష్యత్తులో రిజర్వాయర్‌కు ఎగువున్న ఉన్న భూమిని కూడా ప్రభుత్వం తీసేసుకుని, నష్టపరిహారం ఇస్తుందనే ఉద్దేశంతో పలువురు ఆక్రమించుకుంటున్నారు. రిజర్వాయర్ విస్తీర్ణం 55 ఎకరాలు కాగా ఇందులో సుమారు 20 ఎకరాలను ఆక్రమించి దున్నేశారు. ఇందులో సరుగుడు, జీడిమామిడి, మామిడి మొక్కలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదేళ్ల కిందట రిజర్వాయర్ కుడివైపున ఉన్న భూమిని ఆక్రమించి మామిడి తోటలు వేశారు. సర్వే నంబరు 737లోని ప్రభుత్వ భూములు ఆక్రమణను గురవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంత పలు అనుమానాలకు తావిస్తున్నది. ఊటగెడ్డ రిజర్వాయర్‌ను సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలంటూ ఇటీవల ఆయకట్టు రైతులు అనకాపల్లి వెళ్లి కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు ఏ అధికారి కూడా ఇటువైపు రాలేదు.

## గంజాయి విక్రేతలు, వినియోగదారులతో సహా 14 మంది అరెస్ట్

క్రైం కౌంటర్ న్యూస్, గుంటూరు జిల్లాలో గంజాయి విక్రయం, వినియోగానికి పాల్పడుతున్న నలుగురు విక్రేతలు, 10 మంది వినియోగదారులతో సహా మొత్తం 14 మందిని పెదకాకాని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 4.95 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పెదకాకాని గ్రామంలోని పిహెచ్‌సీ సమీపంలో పాడుబడిన షెడ్‌లో గంజాయి కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గంజాయి, అసాంఘిక శక్తుల రహిత జిల్లాగా గుంటూరును తీర్చిదిద్దేందుకు కార్డన్ సెర్చ్‌లు, ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

# సినిమా



## వాళ్లలాగా చెయ్యమని నన్ను బలవంతం చేసేవారు.

సౌత్ ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగిన హీరోయిన్లలో మీనా ఒకరు. చైల్డ్ ఆర్టిస్టుగా తెరంగేట్రం చేసి ఆ తర్వాత కథానాయికగా మెప్పించింది. మెగాస్టార్ చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ, రజినీకాంత్ వంటి స్టార్ హీరోలతో బ్లాక్ బస్టర్ హిట్స్ చేసింది. దశాబ్దాలపాటు ఇండస్ట్రీని శాసించింది. ఇప్పటికీ సహాయ నటిగా ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ క్రమంలోనే ఓ ఇంటర్వ్యూలో మీనా మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఒకప్పుడు గ్లామర్ పాత్రలకు ప్రాధాన్యతనిచ్చి, అటువంటి పాత్రలు చేయలేదని బాధపడినట్లు తెలిపారు. అయితే పాత్రల ఎంపిక, నటనకు ప్రాధాన్యత ఇవ్వడం తన కెరీర్‌ను మరింత అందంగా మార్చిందని అన్నారు. అలాగే అందరూ హీరోయిన్ల మాదిరిగానే తనను కూడా గ్లామర్ రూల్స్ చేయాలని బలవంతం చేశారని చెప్పుకొచ్చింది.నటి మీనా మాట్లాడుతూ.. ఒకప్పుడు తాను కూడా గ్లామర్ పాత్రలు చేస్తే మరింత గుర్తింపు వస్తుందేమోనని భావించినట్లు తెలిపారు. ఒకప్పుడు గ్లామర్ పాత్రలు చేసే నటీమణులకు లభించే ప్రాధాన్యత, గుర్తింపు చూసి, తాను కూడా అలాంటి పాత్రలు చేయాలనుకున్నానని మీనా తెలిపారు. "నేను కూడా హీరోయిన్నే కదా, వాళ్లకంటే సీనియర్‌ని. నాకెందుకు ఈ గుర్తింపు దొరకడం లేదు?" అని భావించి, అప్పుడు తన తల్లి వద్ద బాధపడిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. కేవలం గ్లామర్ మాత్రమే కాదని, తన పాత్రల ఎంపిక, వైవిధ్యభరితమైన క్యారెక్టర్లు తన కెరీర్‌ను నిలబెట్టాయని ఆమె అన్నారు. ముఖ్యంగా రోజాతో ఒకరికొకరం పోటీపడేవారమని, ఒకరు చేయని సినిమాను మరొకరు చేసేవారమని, "మీనా-రోజా, రోజా-మీనా" అన్నట్లు ఉండేదని ఆమె గుర్తుచేసుకున్నారు.గ్లామర్ పాత్రల ఒత్తిడి గురించి అడగగా, కెరీర్ ప్రారంభంలో పెద్దగా లేకపోయినా, తర్వాత "మీరు కూడా చేయాలి, చేస్తే తప్పు లేదు" అని చాలా మంది ప్రయత్నించారని మీనా అన్నారు. తాను కూడా ప్రయత్నించాలని అనుకొని, ప్రభుదేవా సినిమా కోసం ఒకసారి స్విమ్‌సూట్‌లో నటించానని తెలిపారు. అయితే, ఆ డ్రెస్ వేసుకున్న వెంటనే తాను చాలా అసౌకర్యంగా భావించానని, మేకప్ రూమ్ నుండి బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడ్డానని చెప్పారు. "ఈ హీరోయిన్స్ అందరూ ఎలా చేస్తున్నారురా బాబూ" అని నిజంగానే ఆశ్చర్యపోయానని అన్నారు. కమిట్‌మెంట్ ఇచ్చాను కాబట్టి చేశానని, అది తన కెరీర్‌లో ఒక్కసారి మాత్రమే జరిగిందని మీనా స్పష్టం చేశారు.





## కొబ్బరినీరు మంచిదే కానీ.. వీరికి మాత్రం డేంజర్! అస్సలు తాగొద్దు

కొబ్బరినీరు అనేది సహజమైన సూపర్ ఎనర్జీ డ్రింక్‌గా చెబుతారు. ఆరోగ్యంగా ఉన్నవారైనా, అనారోగ్యంతో ఉన్నవారైనా కొబ్బరి నీరు తాగవచ్చని అంటారు. ఇందులో ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. డీహైడ్రేషన్‌ను నివారించడంలో ఇది సహాయపడుతుంది. ఇందులో కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి. కొబ్బరినీరు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంతోపాటు జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. ఇలాంటి అనేక ప్రయోజనాలు ఉన్న కొబ్బరినీటిని కొందరు మాత్రం తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారు కొబ్బరి నీరు తీసుకుంటే ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.మధుమేహ వ్యాధిగ్రస్తులు

కొబ్బరి నీటిలో నీటిలో సహజ చక్కెర ఉంటుంది (200 మి.లీ.కి దాదాపు 6-7 గ్రాములు). ఇది ఇతర శీతల పానీయాల కంటే తక్కువగా ఉన్నప్పటికీ.. ఇది మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది. అందుకే, డాక్టర్ నిర్దేశించిన విధంగా మాత్రమే తీసుకోవాలి.

మూత్రపిండాల వ్యాధి బాధితులు

మూత్రపిండాల వ్యాధి ఉన్నవారికి కొబ్బరి నీరు ప్రమాదకరమనే చెప్పాలి. ఎందుకంటే.. ఇందులో అధిక స్థాయిలో పొటాషియం ఉంటుంది. మూత్రపిండాలు ఈ పొటాషియాన్ని ఫిల్టర్ చేయలేనప్పుడు.. రక్తంలో పొటాషియం స్థాయిలు పెరిగే 'హైపర్‌కలేమియా' అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది హృదయ స్పందన రేటులో మార్పులు, కండరాల బలహీనతకు కారణమవుతుంది.

అలెర్జీ సమస్యలు ఉన్న వ్యక్తులు

కొబ్బరి నీరు లేదా కొబ్బరి సంబంధిత ఉత్పత్తులను తినేటప్పుడు అలెర్జీలు ఎదుర్కొనే వ్యక్తులు కొబ్బరి నీళ్ళకు దూరంగా ఉండాలి. వీరు కొబ్బరి నీరు తీసుకోవడం వల్ల దురద, చర్మంపై ఎర్రటి మచ్చలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఎదుర్కోవచ్చు.

జలుబు, జ్వరం బాధితులు

ఆయుర్వేదం ప్రకారం.. కొబ్బరి నీళ్ళు శరీరాన్ని చల్లబరుస్తాయి. అందువల్ల, జలుబు, దగ్గు లేదా గొంతు నొప్పి ఉన్నసమయంలో కొబ్బరి నీళ్ళు తాగడం వల్ల కఫం పెరుగుతుంది. దీంతో వారికి వ్యాధి నయం కావడం ఆలస్యం అవుతుంది.

బీపీ బాధితులు

కొబ్బరి నీళ్లలోని పొటాషియం రక్తపోటును తగ్గించడంలో సహాయపడినప్పటికీ.. బీపీ మందులు వాడేవారు జాగ్రత్తగా ఉండాలి. బీపీ మాత్రలతో పాటు కొబ్బరి నీళు తాగడం వల్ల శరీరంలో అధిక పొటాషియం స్థాయిలు ఏర్పడతాయి. ఇతర సమస్యలకు దారితీయవచ్చు.

ఎలక్ట్రోలైట్-నిరోధిత ఆహారం పాటించేవారు

వైద్యుల సలహాతో గుండె జబ్బులు లేదా ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా పొటాషియం, సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుకునేవారు కూడా కొబ్బరినీరుకు దూరంగా ఉండాలి. లేదంటే కొబ్బరి నీరు వారి శరీరంలోని లవణాల సమతుల్యతను దెబ్బతీస్తుంది. వారి ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఏర్పడవచ్చు. అందుకే ఇలాంటి మాత్రం కొబ్బరినీరును వైద్యుల సూచించిన మేరకు తీసుకోవడం లేదా? మానేయడం చేస్తే మంచిది.



## ఇదేం చేస్తుందిలే అనుకునేరు..

కీర దోసకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని తరచుగా సలాడ్లలో, రైతాలలో లేదా జ్యూస్‌లా తీసుకుంటూ ఉంటారు. ఇందులో దాదాపు 95 శాతం నీరు ఉండటం వల్ల ఇది శరీరానికి హైడ్రేషన్ అందిస్తుంది. బరువు తగ్గడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి కీరదోస అద్భుతంగా పనిచేస్తుంది. అంతేకాకుండా, విటమిన్ కె, విటమిన్ సి, పొటాషియం లాంటి ముఖ్యమైన పోషకాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. అయితే, ఈ పోషక ప్రయోజనాలతో పాటు, కొందరికి కీర దోసకాయ ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేయవచ్చని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా తెలిపింది.ఆయుర్వేదం ప్రకారం.. కీర దోసకాయ తింటే చలవ చేస్తుందని అంటారు. శరీరంలో చల్లదనం వల్ల వచ్చే సమస్యలతో బాధపడేవారు దీనిని అస్సలు తినకూడదు. ముఖ్యంగా ఆస్తమా, జలుబు, దగ్గు, శ్లేష్మం, సైనస్ లేదా ఉబ్బసం లాంటి సమస్యలున్నవారు పూర్తిగా పక్కకు పెట్టాలి. అలాగే కీరదోస ఎక్కువగా తీసుకోవడం వల్ల వాతాన్ని పెంచుతుంది. ఇప్పటికే కీళ్ల నొప్పులు లేదా శరీరంలో వాపుతో బాధపడేవారు కీరదోసకు దూరంగా ఉండటం మంచిది. కీర దోసకాయలో ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ, సెన్సిటివ్ జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఇది కొన్ని ఇబ్బందులను కలిగించవచ్చు. ఇందులో ఉండే కుకుర్బిటాసిన్ అనే సమ్మేళనం వల్ల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్(×దీూ) లాంటి జీర్ణ సమస్యలున్నవారికి గ్యాస్, ఉబ్బరం లేదా అజీర్ణం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. కీర దోసకాయలో అధిక నీటి శాతం ఉండటం వల్ల మూత్ర విసర్జన సమస్యలతో బాధపడేవారు దీనిని ఎక్కువగా తీసుకుంటే తరచుగా మూత్ర విసర్జన అవసరమై అసౌకర్యానికి గురికావచ్చు. డయాబెటిస్ రోగులకు కీరదోసకాయలు సాధారణంగా సురక్షతమైనవిగా పరిగణిస్తారు. అయితే, కీరదోసకాయ గింజలు ఇన్సులిన్ లేదా గ్లూకోజ్ తగ్గించే మందులు తీసుకునేవారిలో సమస్యలను సృష్టించవచ్చు. పెద్ద మొత్తంలో గింజలు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా తగ్గి, వణుకు, తలతిరగడం లాంటివి వస్తాయి. నిపుణులు తరచుగా రాత్రి భోజనం తర్వాత కీరదోస తినకూడదని సలహా ఇస్తారు. ఇది జీర్ణం కావడానికి సమయం పడుతుంది. దాని అధిక నీటి శాతం నిద్రకు భంగం కలిగించవచ్చునని చెబుతుంటారు.

## 4 నెలలైనా భారత్‌కు అందని ఆసియా కప్..

సెప్టెంబర్ 28, 2025న జరిగిన ఏషియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, పాకిస్థాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి ఘనవిజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టీమ్ ఇండియా ఈ టోర్నమెంట్‌లో పాకిస్థాన్‌ను వరుసగా మూడుసార్లు ఓడించి చిత్తు చేసింది. అయితే, ఈ విజయం సాధించి మూడు నెలలు గడిచినా టీమ్ ఇండియాకు మాత్రం విన్నింగ్ ట్రోఫీ అందలేదు. సాధారణంగా టోర్నమెంట్ గెలిచిన వెంటనే విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తారు. కానీ మొహ్సిన్ నఖ్వీ ఇప్పటివరకు ఆ ట్రోఫీని భారత్‌కు ఇవ్వలేదు.భారత్‌కు ట్రోఫీ ఇవ్వని మొహ్సిన్ నఖ్వీ..

ఆసియా కప్ చరిత్రలో ఏ జట్టు గెలిచినా ఆ రోజే అధికారికంగా ట్రోఫీని అందజేయడం ఆనవాయితీ. కానీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు, ఏసీసీ అధ్యక్షుడు, పాకిస్థాన్ హోం మంత్రిగా ఉన్న మొహ్సిన్ నఖ్వీ హయాంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఆసియాలోనే అత్యంత బలమైన జట్టుగా భారత్ గెలిచినప్పటికీ, నఖ్వీ ట్రోఫీని అందజేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.



## ఈ ముగ్గురు ఆటగాళ్లకు అర్హతే లేదు.

జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్ కోసం సెలెక్టర్లు జనవరి 3న భారత జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా నియమించాడు. గిల్ ప్రస్తుతం ప్లీహము గాయం నుంచి కోలుకుంటున్నాడు. అయితే అతని పేరు పక్కన 'స్టార్ణ గుర్తు ఉంది. అంటే బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అతనికి ఇంకా గ్రీన్ సిగ్నల్ లభించలేదని అర్థం. వైద్య బృందం అనుమతి ఇస్తేనే ఆయన మైదానంలోకి దిగుతాడు. అయితే, ఈ జట్టులో ఎంపికైన ముగ్గురు ఆటగాళ్లపై తీవ్ర చర్చ జరుగుతోంది. వారి ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉన్నా, కేవలం కోచ్ గౌతమ్ గంభీర్ చొరవతోనే వారికి చోటు దక్కిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ ముగ్గురు ఆటగాళ్లు ఎవరో ఓసారి చూద్దాం..

1. రిషబ్ పంత్: లెఫ్ట్ హ్యాండ్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను సెలెక్టర్లు వన్డే జట్టులోకి తీసుకున్నారు. అయితే, 2025 సంవత్సరంలో పంత్‌కు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఏడాది పొడవునా అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ (2025-26)లో కూడా పంత్ పెద్దగా ప్రభావం చూపలేదు. 5 మ్యాచ్‌ల్లో కేవలం రెండు హాఫ్ సెంచరీలతో 188 పరుగులు మాత్రమే చేశాడు. అదే సమయంలో ధ్రువ్ జురెల్ (379 పరుగులు), ఇషాన్ కిషన్ (2 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీతో 146 పరుగులు) అద్భుతంగా రాణిస్తున్నా బీసీసీఐ వారిని విస్మరించింది.

2. నితీష్ కుమార్ రెడ్డి: యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డికి కూడా జట్టులో చోటు దక్కింది. కానీ అతని గత గణాంకాలు ఏమాత్రం ఆకట్టుకునేలా లేవు. ఇప్పటివరకు ఆడిన రెండు వన్డేల్లో నితీష్ కేవలం 27 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేదు. అతని ఎకానమీ రేటు కూడా 7.74 గా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో కూడా 5 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క అర్ధ సెంచరీ, 6 వికెట్లు మాత్రమే తీశాడు. అయినప్పటికీ సెలెక్టర్లు అతనికి వన్డే క్యాప్ ఇచ్చేందుకు మొగ్గు చూపారు.

3. ప్రసిద్ధ్ కృష్ణ: ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణపై కోచ్ గంభీర్ ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు కనిపిస్తోంది. ప్రసిద్ధ్ ఇప్పటివరకు 21 వన్డేల్లో 37 వికెట్లు తీశాడు. అతని ఎకానమీ రేటు 6.02 గా ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక తరపున కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. మరోవైపు, ఇదే టోర్నమెంట్‌లో 5 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి ఫామ్‌లో ఉన్న మొహమ్మద్ షమీని సెలెక్టర్లు పక్కన పెట్టి ప్రసిద్ధ్‌ను ఎంచుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్)లి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మొహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com